ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 12 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# రాష్ట్రంలో రాహుల్, రేవంత్ ట్యాక్స్



**తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంలా మార్చిందని అప్పట్లో ప్రధాని మోదీ విమర్శించారు**
**అదే నిజమైతే కేంద్రం విచారణ చేపట్టాలి**
**'అమృత్'లో అవినీతి జరుగుతుంటే కేంద్రం చర్యలేవీ?: మాజీ మంత్రి కేటీఆర్**

న్యూఢిల్లీ : "రాష్ట్రంలో తప్పులు జరుగుతున్నాయని ఆధారాలతో వివరాలు ఇస్తున్నామని బీఆర్ఎస్ గౌరవాధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమృత్ పథకంలో అవినీతి జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంస్థలకు కూడా ఈ పథకం పనులు కట్టబెట్టారన్నారు. సొంత వర్గానికి పనులు ఇవ్వడం ఎంత వరకు సబబని నిలదీశారు. న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

లోక్‌సభ ఎన్నికల సమయంలో తెలంగాణలో ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీ .. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా మార్చిందని ఆరోపించారు. రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు చెప్పారు. అదే నిజమైతే కేంద్రం విచారణ చేపట్టాలి. అమృత్ పథకం కుంభకోణంపై విచారణ చేపట్టాలి. మా ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు. న్యూఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు వెళ్లి వస్తున్నారన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి 26 పైసలు కూడా రాలేదన్నారు. అల్లుడి కోసం కొడంగల్‌ను బలిపెట్టే పరిస్థితి తలెత్తిందన్నారు. అందుకే అక్కడ తిరుగుబాటు మొదలైందన్నారు. అస్మదీయులకు లబ్ధి చేకూర్చారని ఝార్ఖండ్ సీఎంపై కేసు పెట్టారన్నారు. అదే కేసును రేవంత్, పొంగులేటిపై ఎందుకు పెట్టడం లేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు?



**ఫోన్ ట్యాపింగ్ కేసులో..**

**వారంతా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల నేతలు**

హైదరాబాద్ : ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో నలుగురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిన్న మాజీ ఎమ్మెల్యే లింగయ్యను విచారించిన అనంతరం వారికి నోటీసులు ఇచ్చారని తెలుస్తోంది.

# 55 మంది అరెస్ట్

**లగచర్ల ఘటన.. దర్యాప్తు ముమ్మరం**

**దుద్యాల : లగచర్ల ఘటనలో 55 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఫార్మాసిటీ ఏర్పాటుకు స్థల సేకరణ కోసం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో నిన్న ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేని గ్రామస్థులు కలెక్టర్ సహా అధికారులపై కర్రలు, రాళ్లతో దాడిచేశారు. ఈ దాడి నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ తప్పించుకున్నారు. కలెక్టర్, అధికారుల కార్లను రైతులు ధ్వంసం చేశారు.**

ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని పట్టుకుని కర్రలు, రాళ్లతో దాడిచేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వారి నుంచి తప్పించుకున్న వెంకట్‌రెడ్డి పొలాల వెంట పరుగులు పెట్టారు. ఆయనను కాపాడేందుకు ప్రయత్నించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపైనా రైతులు దాడి చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో దాడికి పాల్పడిన 55 మందిని గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో త్వరలో నిర్మల భేటీ

**డిసెంబర్ 21, 22వ తేదీల్లో సమావేశం**

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్రాలు తమ సూచనలు తెలియజేసేందుకు రెండురోజుల పాటు ఆర్థిక మంత్రులతో సీతారామన్ భేటీ కానున్నారు. అప్పుడే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కూడా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈసారి జరగబోయేది 55వ జీఎస్టీ మండలి సమావేశం. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కోసం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కసరత్తులు చేస్తున్నారు. దానిలో భాగంగా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ఆమె భేటీ కానున్నారు. డిసెంబర్ 21-22 తేదీల్లో ఈ సమావేశం ఉండనుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. రాజస్థాన్‌లో ఈ సంప్రదింపులు జరగనున్నాయి.



## కూలీలతో వెళ్తున్న బొలెరో బోల్తా

**40 మంది కూలీలకు గాయాలు**
**వనపర్తి జిల్లాలో ఘటన**

వనపర్తి : వనపర్తి జిల్లాలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో మంగళవారం ఉదయం బొలెరో బోల్తా పడిన ఘటనలో 40 మంది కూలీలకు గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం బూత్కూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పొరుగున ఉన్న మహబూబ్ నగర్ జిల్లాలోని ఎంకంపల్లి గ్రామానికి పత్తి ఏరడానికి బయలుదేరారు. నలభై మందికి పైగా కూలీలతో బయలుదేరిన బొలెరో వాహనం పెద్దమందడి మండలం మోజెర్ల స్టేజీ సమీపంలో ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. దీంతో అందులోని కూలీలకు గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను సమీపంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల చికిత్సతో పలువురు కూలీలు కోలుకోగా.. ముగ్గురు కూలీల పరిస్థితి మాత్రం సీరియస్‌గా ఉందని వైద్యులు చెప్పారు. కాగా, బొలెరో టైర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## ప్రదక్షిణ చేస్తుండగా గుండెపోటు

**యువకుడు మృతి**

హైదరాబాద్: గుడిలో ప్రదక్షిణలు చేస్తుండగా ఓ యువకుడు అమాంతం కుప్పకూలిపోయాడు. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో చోటుచేసుకున్నది. మంగళవారం ఉదయం కేపీహెచ్‌బీకి చెందిన విష్ణువర్ధన్ (31).. స్థానికంగా ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయానికి వెళ్లాడు. గుడిలో ప్రదక్షిణలు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో తోటివారు అతడిని దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మరణించాడని తెలిపారు. ఇదంతా గుడిలో ఉన్న సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య




హైదరాబాద్ : ప్రేమికుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మనస్తాపం చెందిన యువతి గుర్రై ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జమ్ము- కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా మాలపొర గ్రామానికి చెందిన ఇరామ్ నబీ దార్ (23) హైదరాబాద్ షేక్‌పేటలో ఓ ఇంట్లో అద్దెకుంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నది. కాగా, ఈ నెల 8న ఆమె స్నేహితుడు అబ్దుల్ ఫోన్ చేయగా ఎంతకు లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చిన అబ్దుల్ వాచ్‌మెన్ సాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆహత్మహత్యకు పాల్పడింది. అబ్దుల్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ముందు రోజు ఇరామ్ నబీ దార్ రాత్రి 2 గంటల వరకు కశ్మీర్‌లోని తన ప్రియుడితో మాట్లాడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రేమ విఫలం కావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు.

## మార్నింగ్ వాక్ చేస్తుండగా

**న్యాయవాదిపై కత్తితో దాడి..**
ఖైరతాబాద్‌లో ఘటన

హైదరాబాద్ : మార్నింగ్ వాక్‌కు వెళ్లిన న్యాయవాదిపై ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. మొబైల్ లాక్కొని పారిపోయాడు. ఖైరతాబాద్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది న్యాయవాది కల్యాణ్ ఎప్పటిలాగే మార్నింగ్ వాక్ చేస్తుండగా అకస్మాత్తుగా గుర్తు తెలియని దుండగులు అతడిపై కత్తితో దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. వారి నుంచి రక్షించుకునే క్రమంలో కల్యాణ్ చేతికి గాయమైంది. చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానలో చేరారు. కల్యాణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దాడికి పాల్పడింది. సెల్‌ఫోన్స్ దొంగలించే ముఠా అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.



## పాదాచారులపై దూసుకెళ్లిన కారు

**ఇద్దరు మహిళలు మృతి**
పని కోసం వచ్చి తిరిగెళ్తుండగా ఘోరం
పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం

పెద్దపల్లి: రాజీవ్ రహదారి వెంట వెళ్లే పాదాచారులపై కారు దూసుకెళ్లడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మరణించారు. ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రమాదంలో మరణించిన మహిళలు పెద్దపల్లి పట్టణంలోని ఉదయనగర్ కు చెందిన కుక్క అమృత, కుక్క భాగ్యగా గుర్తించారు. గాయపడ్డ కుక్క పద్మను ప్రభుత్వాసుపత్రికి తరలించారు, వీరు ఓ కళ్యాణ మండపనికి పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆదర్శనగర్ రాజీవ్ రహదారిపై కారు దూసుకెళ్లింద. ఘటన స్థలానికి చేరుకొని పెద్దపెల్లి ఏసిపి, సిఐ విచారణ చేపట్టారు.

